సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం, 4, ఫిబ్రవరి, 2024



పస్తులతో.. తరగతులకు

పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల హడావుడి మొదలైంది.

వివరాలు 8లో ▸



వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /14.7

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టుకు హైకోర్టు న్యాయమూర్తి



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కోర్టుకు శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి శ్రవణ్‌కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన జ్యుడీషియల్ అధికారుల సమావేశం లోఆయన పాల్గొన్నారు. గతేడాది కాలంలో జిల్లా కోర్టు పరిధిలో నమోదైన కేసులు, విధించిన శిక్షలు తదితర అంశాలపై సమీక్షించారు. మొదట హైకోర్టు న్యాయమూర్తిని అర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ టి.మహేష్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28న విద్యార్థులకు వివిధ రకాల సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర భవిష్యత్ కోసం విజ్ఞానశాస్త్రం అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, నీటి సంరక్షణను ఇతివృత్తంగా చేసుకుని పాటలు, పద్యాలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో పోటీలను ఈ నెల 12లోగా పూర్తిచేసి రాష్ట్రస్థాయిలో ప్రతి విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులను పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని ఎస్సీ ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2,342 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లో సూచించిన సమయంలోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెకుముకి పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి మొత్తం 105 మంది విద్యార్థులు పాల్గొనగా.. మొత్తంగా 5 పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ ఎంపికైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జేవీవీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి వేణుగోపాలవర్మ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ ద్వారా 51 మంది గుర్తింపు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కింద 51 మంది బాలబాలికలను గుర్తించామని, బాలల రక్షణ కోసం నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తించిన 51 మంది బాలబాలికలలో రాష్ట్రానికి చెందినవారు 33 ఉంటే.. ఇతర రాష్ట్రాలకు చెందినవారు 18 ఉన్నారన్నారు. అధికారుల పర్యవేక్షణలో రెస్క్యూ బృందాలు వివిధ ప్రదేశాల్లో వీరందరిని గుర్తించి రక్షణ కల్పించినట్లు వివరించారు. పిల్లలకు చదువుల ద్వారా ఉత్తమ భవిష్యత్ ఉందని ప్రతిఒక్క తల్లిదండ్రులు గుర్తించాలని, ప్రభుత్వాలు ఉచిత వసతితో కూడిన విద్యలు అందిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

12న కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పురపాలిక కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఎన్నుకోనున్నారు. ఈ మేరకు కలెక్టర్ జి.రవినాయక్ శనివారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ రోజు జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

అతివల.. ఆర్థిక స్వావలంబన

- రుణాల పంపిణీలో పాలమూరు జిల్లాలోని మున్సిపాలిటీల ముందంజ
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ముమ్మరంగా యూనిట్ల గ్రౌండింగ్
- గత 2022- 23లో లక్ష్యానికి మించి అందజేత
- చేయూతనందిస్తున్న మెప్మా అధికారులు
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న మహిళా సంఘాల సభ్యులు



జిల్లాకేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్‌కు చెందిన రేణుక 16 ఏళ్ల క్రితం వీరాంజనేయ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి.. మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ, ఎస్ఈపీ రుణాలు తీసుకుంటున్నారు. వీటితో ఎనిమిదేళ్లుగా పూలు, పండ్ల వ్యాపారం నిర్వహిస్తుంది. వీటి ద్వారా ప్రతినెలా రూ.30 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. అంతే కాకుండా పూల దుకాణంలో మరో సహాయకుడిని నియమించుకుని రోజుకు రూ.400 చెల్లిస్తూ ఉపాధి కల్పిస్తోంది.



జిల్లాకేంద్రంలోని బండ్లగేరికి చెందిన విజయలక్ష్మి 23 ఏళ్ల క్రితం గాంధీ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి ప్రస్తుతం అధ్యక్షురాలిగా కొనసాగుతోంది. సంఘంలో పలు సందర్భాల్లో రుణాలు తీసుకుని పదేళ్లుగా చాట్ బండార్ నిర్వహిస్తున్నారు. ఈ షాపు ద్వారా అన్ని ఖర్చులు పోనూ ప్రతిరోజు రూ.వెయ్యి వరకు ఆదాయం ఆర్జిస్తోంది. చాట్‌బండార్ ద్వారా వచ్చిన ఆదాయంతోనే పెద్దమ్మాయికి పెళ్లి చేశానని విజయలక్ష్మి చెబుతున్నారు. మెప్మా ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకి రుణాలు అందుకుని బతుకుదెరువుకు మార్గం లభించిందని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో మహిళా సంఘాలకు రుణాలు అందజేయడంలో మెప్మా అధికారులు ముందంజలో ఉన్నారు. ఏటా మహిళలకు మూడు కేటగిరీల్లో రుణాలు మంజూరు చేస్తున్నారు. గతేడాది బ్యాంకు లింకేజీతోపాటు ఎస్ఈపీ (ముద్ర) ద్వారా ఇచ్చే రుణాల (2022-23)లో లక్ష్యాన్ని అధిగమించగా.. శ్రీనిధికి సంబంధించిన రుణాల మంజూరు లక్ష్యంలో సగానికి చేరుకున్నారు. దీంతో మహిళలు వివిధ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

మూడు మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీల్లో మొత్తం 3,655 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిలో 774 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద గతేడాది రూ.54.97 కోట్లు ఇవ్వాలని మెప్మా అధికారులు నిర్ణయించారు. కాగా.. లక్ష్యానికి మించి 793 సంఘాలకు రూ.60.62 కోట్లు అందజేశారు. అలాగే శ్రీనిధి కింద 132 సంఘాలకు రూ.32.82 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా.. రూ.21.09 కోట్లు (64.27 శాతం) మాత్రమే ఇవ్వగలిగారు. ఇక స్వయం ఉపాధి పథకం (సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాం- ఎస్ఈపీ) కింద 20 యూనిట్లకు గాను రూ.20 లక్షలు ఇవ్వాలని నిర్ణయించగా.. 18 యూనిట్లకు ఏకంగా రూ.26.95 లక్షలు (134.75 శాతం) అందజేశారు.

■ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ మూడు మున్సిపాలిటీల్లోని 622 సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.28.99 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 372 సంఘాలకు రూ.37.22 కోట్లు (106.96 శాతం) అందజేశారు. శ్రీనిధి కింద 132 సంఘాలకు రూ.21.21 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకు రూ.10.37 కోట్లు (48.91 శాతం), ఎస్ఈపీ కింద 23 యూనిట్లకు రూ.23 లక్షలు ఇవ్వాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకు 21 యూనిట్లకు రూ.19 లక్షలు (91.30 శాతం) అందించారు.



గడువులోగా లక్ష్యం చేరుకుంటాం



జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఎస్ఈపీ ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. గతేడాది మాదిరిగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ గడువులోగా లక్ష్యం చేరుకుంటాం. బ్యాంకర్లు, గ్రూపు సభ్యులతోనూ తరచుగా సమావేశాలు నిర్వహిస్తాం. ఇంకా ఉన్న నెలన్నర సమయంలోగా అన్ని యూనిట్లు గ్రౌండింగ్ చేస్తాం. మహిళల నుంచి రుణ బకాయిలు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా వసూలవుతున్నాయి. వారు ఆర్థికంగా ఎదిగేందుకు అన్నివిధాలా సహకరిస్తాం.

– ఎంకేఐ అలీ, మెప్మా పీడీ, మహబూబ్‌నగర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో..	431 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం : రూ.21,00,00,000	268 సంఘాలకు చెల్లించింది : రూ.29,59,25,000 (140.92 శాతం)	
	శ్రీనిధి కింద 64 సంఘాలకు రుణ లక్ష్యం: రూ.12,77,00,000	ఇప్పటి వరకు చెల్లించింది: రూ.7,10,43,015 (55.59 శాతం)	పిల్లలమర్రి టీఎల్ఎఫ్ పరిధిలోని 32 సంఘాలకు రుణ లక్ష్యం: రూ.4,21,45,000
	ఇప్పటి వరకు చెల్లించింది: రూ.1,53,89,014 (36.51 శాతం)	ఎస్ఈపీ (ముద్ర) కింద 15 యూనిట్లకు : రూ.15,00,000	15 యూనిట్లకు అందించింది: రూ.13,00,000 (86.67 శాతం)
జడ్చర్ల..	111 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణలక్ష్యం : రూ.5,35,50,000	80 సంఘాలకు అందించింది : రూ.5,69,50,000 (106.34 శాతం)	
	శ్రీనిధి కింద 24 సంఘాలకు లక్ష్యం : రూ.4,21,90,000	ఇప్పటి వరకు అందించింది: రూ.1,55,48,096 (36.85 శాతం)	ఎస్ఈపీ (ముద్ర) కింద ఆరు యూనిట్లకు లక్ష్యం : రూ.6,00,000
	6 యూనిట్లకు అందించింది : రూ.6,00,000 (100 శాతం)		
భూత్పూర్..	80 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం : రూ.2,63,55,000	24 సంఘాలకు అందించింది : రూ.1,94,00,000 (73.61 శాతం)	
	శ్రీనిధి కింద 12 సంఘాలకు అందించింది : రూ.17,91,432 (36.58 శాతం)	ఎస్ఈపీ (ముద్ర) కింద రెండు యూనిట్ల లక్ష్యం : రూ.2,00,000	మంజూరు చేసింది: నిల్

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పాఠశాల స్థాయిలో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు పరీక్షలపై భయం పెట్టుకోకూడదని, భయాన్ని పోగొట్టి, అవగాహన పెంచేందుకు ప్రేరణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. పరీక్షల ముందు ఎక్కువ సమయాన్ని ప్రిపరేషన్‌కు కేటాయించాలని, ఎక్కువ సార్లు ప్రాక్టిస్ చేస్తే సబ్జెక్టు బాగా గుర్తుకు ఉంటుందన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్, ఇంపాక్ట్ సంస్థ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు, డీఆర్‌డీఓ యాదయ్య, ఏఎంఓ శ్రీనివాస్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లైయిమ్స్ విడుదల చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కార్మిక శాఖలో పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు అన్నారు. ఈ మేరకు శనివారం కార్మిక శాఖ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్-1, 2లలో దాదాపు వెయ్యి క్లైయిమ్స్ ఉన్నాయన్నారు. మీ సేవలో కొత్తగా రిజిస్ట్రేషన్లు, క్లెయిమ్స్ సర్వర్ రావడం లేదని దీంతో కొత్త దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2019 నుంచి కొత్త గుర్తింపు కార్డులు రాకపోవడంతో డెలివరీ, మ్యారేజ్, డెత్ క్లైయిమ్స్ చేసుకోలేకపోతున్నారని వాపోయారు. వీటిపై అధికారులు శ్రద్ధ వహించి వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలని, మీ సేవా సర్వర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, గణేష్, బాలు పాల్గొన్నారు.

అడవికి ఆపద



ఎయిర్ బ్లోయర్లతో మంటలను అదుపులోకి తెస్తున్న అటవీ సిబ్బంది

- నల్లమలలో తరచుగా అగ్నిప్రమాదాలు
- ఇటీవల కొల్లంపెంట ప్రాంతంలో రాజుకున్న మంటలు
- బుగ్గిపాలవుతున్న అమూల్యమైన వనసంపద
- స్థానికులు, శ్రీశైలం ప్రయాణికులతో పొంచి ఉన్న ముప్పు
- సత్ఫలితాలివ్వని అటవీశాఖ నివారణ చర్యలు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలో తరచుగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అటవీ ప్రాంతంలో చెలరేగే కార్చిచ్చు కారణంగా అడవిలోని అమూల్యమైన వనసంపద బూడిద పాలవడంతో పాటు వన్యప్రాణుల పాలిట మృత్యుపాశంగా మారుతోంది. ఇటీవల అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని కొమ్మనపెంట, పల్లె బైలు, బోరెడ్డిబావి సమీపంలో సుమారు 10 హెక్టార్లకు పైగా వనసంపద కాలిబూడిదైంది. వెంటనే అప్రమత్తమైన అటవీశాఖ పదుల సంఖ్యలో సిబ్బందితో కలిసి నివారణ చర్యలు చేపట్టింది. దట్టమైన అటవీ ప్రాంతంలోకి ఫైరింజన్లు వెళ్లేందుకు వీలుకాకపోవడంతో ఎయిర్ బ్లోయర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలానికి సమీపంలోని గ్రామానికి చెందిన పశువుల కాపరి రాజేసిన అగ్ని కారణంగా అటవీ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగినట్టు తెలుస్తోంది.

ఫైర్ లైన్లతో రక్షణ..

వేసవి నేపథ్యంలో నల్లమలలో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దట్టమైన గడ్డి క్షేత్రాలు ఉన్నచోట ముందు జాగ్రత్త చర్యగా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా ఒకచోట చెలరేగిన అగ్ని మరోచోటకు వ్యాప్తి చెందకుండా నివారించేందుకు వీలవుతుంది. అలాగే ఎక్కడైనా ప్రమాదవశాత్తు నిప్పు చెలరేగినా.. దూరం నుంచి పసిగట్టేందుకు అడవిలో ఎత్తైన చోట్ల వాచ్ టవర్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కార్చిచ్చులను ముందే పసిగట్టి వాటిని ఆర్పడం వల్ల వన్యప్రాణులు, వన సంపదకు జరిగే నష్టాన్ని చాలా వరకు తగ్గించే ఆస్కారం ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలోకి ఫైర్ ఇంజిన్లు వెళ్లే అవకాశం లేకపోవడంతో అటవీశాఖ ప్రత్యామ్నాయంగా ఎయిర్ బ్లోయర్లను వినియోగిస్తోంది. వీటి ద్వారా వెంటనే అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతానికి వెళ్లి వేగంగా మంటలను అదుపు చేస్తోంది. అయితే నల్లమలలో ఫైర్ లైన్ల ఏర్పాటు, ఎయిర్ బ్లోయర్ల వినియోగం, సిబ్బంది నియామకం సంబంధించి నిధుల కొరత ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వన్యప్రాణులు, అడవి సంరక్షణకు దృష్టిసారించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీశైలం వెళ్లే యాత్రికులు..

నల్లమలలోని వన్యప్రాణులకు వేసవికాలంలో అగ్నిప్రమాదాల ముప్పు పొంచి ఉంది. ప్రధానంగా శ్రీశైలం వెళ్లే యాత్రికులు నల్లమలలోని ఘాట్ రోడ్డు గుండా ప్రయాణం చేస్తారు. మార్గమధ్యలో అడవిలో కొందరు ఆగి వంట చేసుకోవడం, మరికొందరు పొగ తాగడానికి నిప్పును రాజేస్తున్నారు. ఈ క్రమంలో వేసవిలో ఎండిన ఆకులు, గడ్డి కారణంగా అగ్ని వేగంగా వ్యాపించి సమీపంలోని అడవినంతా దహనం చేస్తోంది. సమీప ప్రాంతంలోని పశువుల కాపరులు, స్థానికులు సైతం అడవిలో తరచుగా నిప్పు రాజేస్తూ కార్చిచ్చుకు కారణమవుతున్నారు. దీనిపై అటవీశాఖ స్థానికులకు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదని తెలుస్తోంది. అలాగే అటవీ ప్రాంతంలో పర్యాటకులు నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో అమూల్యమైన వనసంపద, వన్యప్రాణులు అగ్ని ఆహుతవుతున్నాయి.

ముందస్తు చర్యలు చేపడుతున్నాం..



వేసవి నేపథ్యంలో నల్లమలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట ఫైర్‌లైన్లు, వాచ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రమాదం సంభవించిన వెంటనే అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని ఎయిర్ బ్లోయర్లతో మంటలను అదుపులోకి తెస్తున్నాం. అటవీ ప్రాంతంలో అగ్గి రాజేయొద్దని శ్రీశైలం ప్రయాణికులతోపాటు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రోహిత్, డీఎఫ్ఓ, నాగర్‌కర్నూల్

ప్రతి ఏటా వేసవిలో..

విశిష్టమైన వృక్ష, జంతుజాతులకు నల్లమల అటవీ ప్రాంతం నిలయంగా మారింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 23 వరకు పెద్ద పులులు, మరో వందకుపైగా చిరుతలు, నీల్‌గాయి, జింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు తదితర వన్యప్రాణులు వేలాది సంఖ్యలో ఆశ్రయం పొందుతున్నాయి. ప్రతిఏటా వేసవి సమయంలో తరచుగా అడవిలో చెలరేగుతున్న కార్చిచ్చు కారణంగా హెక్టార్ల కొద్ది అడవి అగ్నికి ఆహుతవుతోంది. ప్రధానంగా ఇక్కడి అమూల్యమైన వనసంపద, అరుదైన వృక్ష జాతులు, వాటితో మిళితమై ఉండే వన్యప్రాణులు, సరిసృపాలు, వేగంగా కదలలేని జీవులన్నీ అగ్గిలో దహనమవుతున్నాయి. కొన్నిసార్లు అగ్గి అదుపులోకి రాక వందలాది ఎకరాలకు దావనంలా వ్యాపించి తీవ్ర నష్టం కలిగిస్తోంది. గతేడాది సైతం దోమలపెంట సమీపంలో రెండు రోజులపాటు కార్చిచ్చు చెలరేగి 20 హెక్టార్ల వరకు అడవి దహనమైంది.



నల్లమల అటవీప్రాంతంలోని కొమ్మనపెంట సమీపంలో చెలరేగిన మంటలు

441 పంచాయతీలకు ప్రత్యేక అధికారులు



వీసీలలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, ఆయా శాఖల జిల్లా అధికారులు

- వీసీలో కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని 441 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆయా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదులిస్తూ ఇప్పటికే వీసీ ద్వారా ప్రత్యేక అధికారులకు తగు సూచనలిచ్చామన్నారు. ఈనెల 5న వారికి శిక్షణ ఇస్తామని, తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలు, గిరిజన తండాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ఎక్కడైనా లీకేజీలుంటే అరికడతామని, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలపై ఇంటింటి సర్వేతో పాటు ఈనెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపడతామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.14 కోట్ల విలువ జేసే 285 పనులకు మంజూరు ఇచ్చామనిచ, అవి వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్‌భగీరథ ఎస్ఈ వెంకటరమణ, డీఆర్‌డీఓ యాదయ్య, పీఆర్ ఈఈ నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన గ్రామాలన్నింటినీ సందర్శించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై విశ్లేషణ చేయాలన్నారు. ఇకపై పంచాయతీ కార్యదర్శులందరూ గ్రామాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో విద్యుత్, ఇతర బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు.

అవగాహన సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాబోయే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒత్తిడిని జయించి.. ఏకాగ్రతతో చదవడం ఎలా అనే అంశంపై ఈ నెల 9న జిల్లాకేంద్రంలోని సుదర్శన్ ఫంక్షన్ హాల్‌లో గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ రవినాయక్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు భరత్ మాట్లాడుతూ అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వక్తలుగా పీయూ సైకాలజిస్టు అధ్యాపకులు జంగం విశ్వనాథ్, డాక్టర్ వాసుచైతన్య హాజరవుతారన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ రాథోడ్, శ్రీను, బాలాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

పాలమూరు: మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు అమలు చేయకపోతే నిరవధిక సమ్మె తప్పదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. ఈ మేరకు శనివారం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్‌కు కార్మికుల డిమాండ్ నోటీస్ అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్‌లకు జీఓ 60 ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ పారదర్శకంగా జరగాలన్నారు. ఆస్పత్రిలో ప్రభుత్వం విడుదల చేసిన జీఓ అమలు చేయకుండా ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికుల సగటు వేతనం నుంచి భారీ కోతలు పెడుతూ పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులో అక్రమాలకు పాల్పడుతున్న చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు.

క్లుప్తంగా

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి


గంధం వెంకటమ్మ (ఫైల్)

ఉప్పునుంతల: అచ్చంపేట- ఉప్పునుంతల రోడ్డు మార్గంలోని కేజీబీవీ సమీపంలో శుక్రవారం సాయంత్రం బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడిన మండల కేంద్రానికి చెందిన గంధం వెంకటమ్మ (60) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. ఇందుకు సంబంధించి మృతురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటమ్మ రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని సాయంత్రం రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ ఇంటికి వస్తుంది. కేజీబీవీ పాఠశాల సమీపంలోకి రాగానే అచ్చంపేట వైపు నుంచి బైక్‌పై వచ్చిన రంగంపేటకు చెందిన గడ్డమీది మహేష్ అతివేగంగా వచ్చి వెంకటమ్మ వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. ఆమె బీటీ రోడ్డుపైన పడటంతో తలకు తీవ్రమైన గాయమైంది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మొదట అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లి అనంతరం వెల్దండ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. శనివారం తెల్లవారుజామున గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు గంధం వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

బావిలో పడి రైతు..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుడిపల్లిలో చోటు చేసుకోగా శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాంచందర్ తెలిపిన సమాచారం మేరకు.. గుడిపల్లికి చెందిన మల్లేష్ (40) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గత నెల 31న తన వ్యవసాయ పొలంలో మోటారు ఆన్ చేసేందుకు ఇంటి నుంచి వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. కుటుంబ సభ్యులు మూడురోజుల నుంచి వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. శనివారం ఉదయం వ్యవసాయ పొలంలోని బావిలో మృతదేహం నీటిపై తేలడంతో గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

నవాబుపేట: మండలంలోని తంగెళ్లపల్లికి చెందిన వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిందని హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని రుద్రారం చెందిన గోవు బాలమ్మ(45) 20ఏళ్ల క్రితం తంగెళ్లపల్లికి చెందిన మురగని మల్లేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా వారికి నలుగురు సంతానం ఉన్నారు. కొంతకాలంగా మల్లేష్ హైదరాబాద్‌లో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం తంగెళ్లపల్లిలో నివాసం ఉంటున్న బాలమ్మ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె మృతికి తన అల్లుడు కారణమని, మృతురాలి తండ్రి గోవు శాంతయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కేసు నమోదు చేసినట్లు హెచ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వృద్ధుడు మృతి

- దుర్వాసన రావడంతో గుర్తించిన గ్రామస్తులు


నారాయణ (ఫైల్)

నవాబుపేట: ఓ వృద్ధుడు చనిపోయిన రెండ్రోజులకు గది నుంచి దుర్వాసన రావటంతో గుర్తించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించిన ఘటన మండలంలోని కూచూరులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొంగు నారాయణ (80) గదిలో పడుకున్న చోటే మృతిచెందాడు. గదిలో నుంచి దుర్వాసన వస్తుండటంతో బంధువులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడిని పిలిపించి అతడి సమక్షంలో తలుపులు తెరిచి చూడగా చనిపోయి కనిపించాడు. రూరల్ సీఐ గాంధీనాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. నారాయణ ఈ నెల 1న పింఛన్ తీసుకొని కల్లు అధికంగా తాగడంతో పడుకున్న చోటే మృతిచెంది ఉంటాడని, మృతదేహానికి ఎలాంటి గాయాలు లేవని సీఐ వివరించారు. కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

జడ్చర్ల: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన లింగమ్మ (65) బూరెడ్డిపల్లి శివారులో ఓ పాఠశాల వెనుక వాటర్ ట్యాంకు మెట్లకు తన చీర కొంగుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియలేదు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

పస్తులతో ప్రత్యేక తరగతులకు

- ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల పాట్లు
- స్నాక్స్ పంపిణీపై స్పష్టత కరువు
- పెరిగడువునే స్పెషల్ క్లాసులకు వస్తున్న వైనం
- ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందించాలని విద్యార్థి సంఘాల డిమాండ్


ధర్మాపూర్ పాఠశాలలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ వార్షిక పరీక్షల హడావుడి ప్రారంభమైంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు.. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంపై దృష్టి సారించారు. అందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మండల, జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆకలి సమస్య తలెత్తుతోంది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకుగాను ఉదయం టిఫిన్ కూడా చేయకుండా హడావుడిగా ఇంటి నుంచి బయల్దేరుతున్నారు. ఇక సాయంత్రం వేళ కూడా ఆలస్యం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం నుంచి ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. వనపర్తి జిల్లాలో కూడా స్నాక్స్ పంపిణీ చేసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. మిగతా జిల్లాల్లో కూడా విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 27,787 మంది విద్యార్థులు..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 27,287 మంది ఎస్‌ఎస్‌సీ విద్యార్థులు ఉన్నారు. గత సంవత్సరం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా ఒక్కొక్కరికి రూ.15 చొప్పున వెచ్చించి రోజు ఉదయం, సాయంత్రం స్నాక్స్ పంపిణీ చేసింది. ఈ సంవత్సరం ఎక్కడా నిధులు ఇవ్వలేదు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేసేందుకుగాను కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం నుంచి స్నాక్స్ పంపిణీ చేయనున్నారు. ఇక గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్నాక్స్ పంపిణీపై ఎలాంటి స్పష్టత రాలేదని తెలుస్తోంది. విద్యార్థుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్నాక్స్ పంపిణీ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థుల వివరాలు..

జిల్లా	విద్యార్థులు
మహబూబ్‌నగర్	6,520
వనపర్తి	3,320
నాగర్‌కర్నూల్	5,390
గద్వాల్	5,732
నారాయణపేట	6,230



రేపటి నుంచి అందిస్తాం..



నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్ పంపిణీ చేసేందుకు కలెక్టర్ నిధులు ఇవ్వనున్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలు వచ్చాయి. సోమవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్నాక్స్ అందిస్తాం. – గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్/వనపర్తి

ప్రతిపాదనలు పంపించాం..



ఉదయం, సాయంత్రం స్నాక్స్ పంపిణీ చేసేందుకు అవసరమైన నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు విద్యార్థులకు అంబలి పంపిణీ చే యాలని హెచ్‌ఎంలకు సూచించాం. ఎస్‌ఎస్‌సీ లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

రెండు గంటలు అదనం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేందుకుగాను ప్రభుత్వం లక్ష్య కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా రెండు గంటలు అదనంగా పాఠశాలలను నడిపిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు సాధారణంగా ఉదయం 9:35గంటలకు ప్రార్థన ప్రారంభమవుతుంది. పదోతరగతి విద్యార్థులకు ఉదయం 8:30నుంచి 9.30గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అంటే విద్యార్థి ఇంటి నుంచి ఉదయం 7:30 గంటలకు బయల్దేరాల్సి ఉంటుంది. సాయంత్రం సాధారణంగా 4:45 గంటలకు పాఠశాల ముగుస్తుంది. అయితే పదో తరగతి విద్యార్థులకు 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటికి చేరే వరకు 6:30 గంటల సమయం అవుతుంది. దీంతో విద్యార్థులకు ఆకలి సమస్య తలెత్తుతోంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల లొల్లి

జడ్చర్ల: పట్టణంలో విద్యుత్ శాఖ సబ్‌డివిజన్‌లో అక్రమంగా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను తరలించి సొమ్ము చేసుకున్న ఆరోపణలు వచ్చాయి. శనివారం ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో సైతం సమాచారం వైరల్ అయ్యింది. స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ట్రాన్స్‌ఫార్మర్లను అక్రమంగా తరలించారని దీనిపై సమగ్ర విచారణ చేసే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న సమాచారం చర్చనీయాంశగా మారింది. ఓ సెల్ టవర్ వద్ద బిగించిన ట్రాన్స్‌ఫార్మర్లను నవాబ్‌పేట మండలానికి తరలించారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ భాస్కర్ స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు, తరలింపుపై పూర్తి స్థాయిలో విచారించి నివేదిక అందజేయాల్సిందిగా స్థానిక అధికారులను ఆదేశించారు. రాజాపూర్ సబ్ డివిజన్ ఏడీఈ తావుర్యా నాయక్ వెంటనే నవాబ్‌పేట మండలం ఏఈఈకి సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. ఎక్కడైనా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించినా తమకు సమాచారం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏడీఈ శ్రీనివాసులు సైతం స్థానిక ఏఈఈ కిరణ్‌ను ఆరా తీశారు.

తమ దగ్గరే ఉన్నాయి

సెల్ టవర్స్ దగ్గర ఉన్న మూడు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తమ దగ్గరే ఉన్నాయని స్థానిక ఏఈఈ కిరణ్ తెలిపారు. వెంచర్ ఏర్పాటు సమయంలో సెల్ టవర్స్ దగ్గర ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను నిర్వాహకులు తమకు స్వాధీనం చేశారని, వాటిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలలో నిజం లేదన్నారు.

అయితే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తమ దగ్గరే ఉన్నాయని స్థానిక ఏఈఈ కిరణ్ తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కాగా నియోజకవర్గ ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో ఉన్న సెల్ టవర్స్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కొన్ని రోజుల క్రితం నుండి కనిపించకుండా పోయాయని, వాటిపై జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లడంతో దీనిపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు, తరలింపు వెనుక ఎవరి హస్తం ఉందన్న విషయాలపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్‌ఐలు

దామరగిద్ద: పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శనివారం మధ్యాహ్నం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని వత్తుగుండ్లకు చెందిన నడిమింటి లాలప్ప పాత ఇంటిని కూల్చి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టి లెంటల్ లెవర్ వరకు పూర్తి చేశారు. అదే ఇంట్లోని ఓ గదికి తలుపు తాళం ఏర్పాటు చేసి నివాసం ఉంటున్నారు. ఇంటి నిర్మాణం ఫ్లోరింగ్, సిమెంట్ తదితర పనుల కోసం ఇటీవల నారాయణపేటలోని ఆప్టస్ ఫైనాన్స్‌లో హోంలోన్ రూ.7 లక్షలు, ఇటీవల వేరుశనగ పంట అమ్మగా వచ్చిన మరో రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.9 లక్షలు ఇంట్లోని పెట్టెలో దాచాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పని నిమిత్తం నారాయణపేటకు వెళ్లగా.. ఎవరూ లేనిది గమనించిన దుండగులు కిటికీని పగులగొట్టి పెట్టెలో దాచిన రూ.9 లక్షలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తిరిగి వచ్చిన లాలప్ప ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పెట్టెను గమనించగా డబ్బులు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవిబాబు, ఎస్‌ఐ వసంత సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం క్లూజ్ టీంతో వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

భూత్పూర్: మండలంలోని తాటికొండలో శుక్రవారం మధ్యరాత్రి ఓ ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు బీరమ్మ ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటుంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మధ్యరాత్రి దాటిన తర్వాత బీరమ్మ బాత్‌రూంలోకి వెళ్లింది. విషయాన్ని గమనించి గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బయటకు వచ్చాడు. కేకలు వేయడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఇంట్లోని బీరువా తెరిచి ఉన్న విషయం గమనించిన 3 తులాల బంగారు నానుతో పాటు తులం చెవి కమ్మలు కనిపించలేదు. శనివారం భూత్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్



ఆత్మకూర్: వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక అయ్యప్ప కాలనీలో నివాసముంటున్న బిలకంటి జనార్దన్ నివాసంలో ఎవ్వరులేని సమయంలో గత నెల 23న రూ.60 వేలు నగదు చోరీ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ అయిన షేక్‌ఖాజపీర్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నామని వివరించారు. నిందితుడిపై గతంలోనూ అనంతపురం జిల్లాలో, కొత్తకోటలో చోరీ కేసులు ఉన్నాయని, న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారని తెలియజేశారు.

చిరుత పులుల సంచారం

అటవీ శివారు ప్రాంతాల్లో భయాందోళన


పాతదారారం సమీపంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంత శివారు ప్రాంతాల్లో చిరుత పులుల సంచారంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చిరుత పులులతో ప్రజలకు ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణహాని లేకపోయినా.. మూగ జీవాలపై చిరుతలు దాడి చేయడంతో గొర్రెలు, మేకల కాపరులు భయాందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల కిందట మండలంలోని పాతదారారం సమీపంలోని మశమ్మ చెర్వు వద్ద మేతమేస్తున్న గొర్రెల గుంపుపై చిరుత దాడి చేసి గొర్రెను చంపింది. ఆ కళేబరాన్ని శనివారం గుర్తించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ బీట్ అధికారులు ఖాదర్‌పాషా, శివాజీ సంఘటన స్థలాన్ని పరిశీలించి గొర్రెపొట్టేలును చంపింది చిరుతగా నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో వేసవిలో వన్యమృగాలకు ఆహారం, నీరు దొరకడం కష్టంగా ఉంటుందని, ఈ సమయంలో వన్యమృగాలు గ్రామాల వైపు వచ్చే అవకాశాలు ఉంటాయని అటవీశాఖ వారు హెచ్చరికలు చేస్తున్నారు. అప్పాయపల్లి, శ్రీరంగాపూర్, చెన్నంపల్లి, ఎర్రపెంట, పద్మన్నపల్లి, పాతదారారం, క్యాంపు రాయవరం, రాయవరం తదితర గ్రామాలు అటవీ ప్రాంతానికి అనుసరించుకొని ఉన్నాయి. నెల రోజుల కిందట అవుసలికుంట శివారులో జరిగిన రెండు సంఘటనలు కూడా చిరుతవే అని ప్రజలు గుర్తించారు. ఇలాంటి సమయంలో అడవికి వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులు, మేకలు, గొర్రెల మందలను అటవీ ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లకపోవడం మంచిదని అంటున్నారు. కాగా అటవీ ప్రాంతంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ వారు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు


ఏర్పాటు చేసిన బోను

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు వెంకటాంపల్లి, తిర్మలాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, పర్వతాపురం తదితర గ్రామాల్లో రెండు నెలలుగా చిరుత సంచరిస్తూ మేకలు, గొర్రెలు, లేగదూడలను ఎత్తుకెళ్లి చంపి తినేస్తుంది. రెండ్రోజుల క్రితం ఓ మేకల కాపరి చిరుతను ప్రత్యక్షంగా చూడటంతో పాటు వీడియో తీయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోజుకో గ్రామశివారులో సంచరిస్తుండటంతో ఫారెస్టు అధికారులు కూడా పట్టుకోవడానికి వీలుకావడం లేదు. దీంతో శనివారం ఖిల్లాఘనపురం శివారులోని ఎర్రకుంట ప్రాంతంలో బోను ఏర్పాటు చేశారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేసినట్లు డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి తెలిపారు. రేంజ్ అధికారి భాస్కరాచారి, సిబ్బంది ఆంజనేయులు, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

జల్సా తెచ్చిన చేటు

- కారుతో షికారుకెళ్లి అర్ధరాత్రి ప్రమాదం
- అక్కడికక్కడే ఓ యువకుడి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు

హన్వాడ: ఆ యువకులంతా కష్టజీవులే.. రెక్కాడితే గాని పూటగడవని పరిస్థితి.. కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న ఆ యువకులు సరదా కోసం కారులో షికారుకెళ్లి ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో నలుగురు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల వివరాల మేరకు.. దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ గ్రామానికి చెందిన మోటిపతి కృష్ణ (23) జిల్లా కేంద్రంలోని ఓ దాబాలో పనిచేస్తున్నాడు. అతడికి తల్లి అక్కమ్మ, తమ్ముడు, చెల్లి ఉండగా.. తండ్రి చిన్నతనంలోనే మృతిచెందాడు. కుటుంబ పోషణ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ దాబాలో పనికి కుదిరాడు. ఈక్రమంలో కృష్ణకు జిల్లా కేంద్రంలో మెకానిక్ పనిచేసే వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం దేవర్ ఫసలాబాద్‌కు చెందిన బెల్లం కృష్ణ, ప్రశాంత్, సోము కిరణ్‌కుమార్, శేరు రాజు స్నేహితులయ్యారు. బెల్లం కృష్ణ కారు మెకానిక్ కావడంతో అతడి షెడ్‌కు మరమ్మతు నిమిత్తం వచ్చిన కారులో శుక్రవారం అర్ధరాత్రి ఐదుగురు మిత్రులు సరదాగా కోయిల్‌కొండ వైపు వెళ్లారు. అటు నుంచి తిరిగి వస్తున్న క్రమంలో హన్వాడ మండలం చిర్మల్‌కుచ్చ శివారులోని టెంపుల్‌తండా వద్ద రోడ్డు పక్కనున్న ఓ చెట్టును బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో మోటిపతి కృష్ణ అక్కడికక్కడే మృత్యువాత పడగా.. శేరు రాజు తలకు బలమైన గాయమైంది. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మిగతా క్షతగాత్రులు బెల్లం కృష్ణ, సోము కిరణ్‌కుమార్, ప్రశాంత్‌లకు తీవ్రగాయాలై జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి తల్లి అక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ సాయిబాబా తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


మొక్కజొన్న, సూక్ష్మధాతువు లోపం ఉన్న చీని ఆకులు

అలంపూర్: జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో మొక్కజొన్న పంటలు అధికంగా సాగుచేస్తారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించడానికి అవకాశం ఉంది. కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సక్రియా నాయక్ సూచించారు. కత్తెర పురుగు నివారణకు సలహాలు, సూచనలు వివరించారు. యాసంగిలో పంట మొలక దశ నుంచి కొంత ఏపుగా పెరగడంతో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే ఆశించిన దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు.

నివారణ.. కత్తెర పురుగు ఆశించిన పంటకు ముందుగా వేపనూనె 1500 పీపీఎంలను, 5 లీటర్ల నీటికి, క్లోరిపైరిఫాస్ 50 మిల్లీలీటర్లతో కలిపి పిచికారీ చేసుకోవాలి. తర్వాత థయోమిథాక్సిమ్ 12.6 శాతం, లామ్డాసైహలోథ్రిన్ 9.5 శాతం, ఎస్‌సీ 0.5 మిల్లీలీటర్లు లేదా క్లోరాన్ ట్రనోలిపోల్ 18.5 శాతం ఎస్‌సీ 0.4 మిల్లీలీటర్లు లేదా స్పైనోటోరమ్ 11.7 శాతం, ఎస్‌సీ 0.5 మిల్లీలీటర్‌కు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందులను ఒకసారి తప్పించి మరోసారి పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

చీని తోటలో సూక్ష్మధాతువు లోపాలు..

చీని తోటల్లో వేరుకుళ్లు, సూక్ష్మధాతువు లోపాలను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. చీని పంటలో వేరుకుళ్లు తెగులు ఆశించడానికి అవకాశం ఉంటుంది. ఈ తెగుళ్ల ఆశించిన మొక్కల వేర్లు మొదట నల్లగా మారుతాయి. ఆ తర్వాత చెట్లు ఒకదాని తర్వాత ఒకటి చనిపోతాయి.

నివారణ ఇలా..

ఈ తెగుళ్ల నివారణకు బానిస్టన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో ద్రావణాన్ని పోయాలి. ఈ పద్ధతి ఒకటి నుంచి రెండు సార్లు 15 రోజుల పాటు పాటించాలి. అదేవిధంగా చీని తోటల్లో సూక్ష్మధాతువు లోపాలను గుర్తించామన్నారు. వీటి ఆకుల మధ్య ఈనెలు పసుపు పచ్చ రంగుగా మారి తర్వాత ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు ఫార్ములేషన్ 4 లేదా 6 (5 గ్రాములు) లీటరు నీటికి కలుపుకొని ఆకుల మీద పడేలా పిచికారీ చేసుకోవాలి. చీని తోటలో వేరుకుళ్లు తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి 5 కిలోలు, 50 కిలోల పేడలో వేసుకొని వారం రోజుల తర్వాత మొదళ్లలో వేసుకోవాలని సూచించారు. దీంతో ట్రైకోడర్మా విరిడి వేరుకుళ్లు కలగజేసే శిలీంద్రాన్ని ఆశించి వేరుకుళ్లు రాకుండా కాపాడుతుంది.

లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై కేసు

జడ్చర్ల: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. జడ్చర్ల పట్టణంలో 10వ తరగతి చదువుతున్న ముగ్గురు గిరిజన విద్యార్థినులు శుక్రవారం కాలినడకన తండాకు వెళ్తుండగా, ఓ యువకుడు (21) అసభ్యకరంగా ప్రవర్తించాడు. వారు అతడి నుంచి తప్పించుకుని వెళ్లారు. కొద్ది సేపటికి మరో విద్యార్థిని కాలినడకన ఇంటికి వెళ్తుండగా.. ఆమెతో కూడా అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి యత్నించాడు. సదరు బాలిక విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మైనర్‌పై లైంగిక దాడి

జడ్చర్ల: జడ్చర్ల పట్టణ శివారులో మైనర్ బాలిక (13)పై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సీఐ ఆదిరెడ్డి వివరాల మేరకు.. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికను యాదగిరి (30) అనే వ్యక్తి నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదగిరిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

హైటెక్ మోసాల ఆటకట్టు

సైబర్ నిందితుడి వద్ద నేరాలపై శిక్షణ

- ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు
- డేటా ఎంట్రీ జాబ్స్ అంటూ నిరుద్యోగులకు వల
- తెలంగాణ సహా 25 రాష్ట్రాలలో మోసాలు
- రూ.100 కోట్లకు పైగా సొమ్ము వసూలు చేసిన ముఠా
- నలుగురు అంతర్రాష్ట్ర సైబర్ నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నిందితుడి వద్ద శిక్షణ తీసుకొని, ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి తెలంగాణ సహా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ సైబర్ ముఠా గుట్టురట్టయింది. డేటా ఎంట్రీ జాబ్స్ పేరిట నిరుద్యోగులకు వల వేసి.. ఆపై కంపెనీ షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగల్ నోటీసులు పంపించి బాధితుల నుంచి సొమ్ము వసూలు చేసిందీ గ్యాంగ్. తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి 25కుపైగా రాష్ట్రాలలో 358 సైబర్ కేసులున్న ఈ ముఠా.. ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లకు పైగానే సొమ్ము వసూలు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

టెలీ కాలర్‌గా పని చేసి..

గుజరాత్‌లోని సూరత్‌లో నకిలీ డేటా ఎంట్రీ కంపెనీలో దిండోలి ప్రాంతానికి చెందిన రాహుల్ అశోక్ భాయ్ భాస్కర్ టెలీ కాలర్‌గా పని చేశాడు. ఓ సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు కంపెనీ యజమాని నితీష్‌ను అరెస్టు చేసి, కాల్ సెంటర్‌ను మూసేశారు. కాల్ సెంటర్, డేటా ఎంట్రీ కార్యకలాపాలపై పట్టు సాధించిన రాహుల్.. తన స్నేహితులైన సాగర్ పాటిల్, కల్పేష్ థోరట్, నీలేష్ పాటిల్‌లను సంప్రదించి సైబర్ మోసాల గురించి వివరించాడు. ఈ నలుగురూ కలిసి సూరత్‌లో ఫ్లోరా సొల్యూషన్ పేరుతో నకిలీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి నిరుద్యోగుల డేటాను సేకరించి, వారికి వాట్సాప్ ద్వారా డేటా ఎంట్రీ జాబ్ సందేశాలను పంపించేవారు. ఆసక్తి కనబరిచిన వారికి జాబ్ లాగిన్ కోసం ఐడీ, పాస్‌వర్డ్ అందించేవారు.



నకిలీ లీగల్ నోటీసులతో బెదిరింపులు..

డేటా ఎంట్రీ పని పూర్తయ్యాక ఉద్యోగికి సొమ్ము చెల్లించకుండా కంపెనీ ప్రమాణాలకు తగిన స్థాయిలో డేటా ఎంట్రీ లేదని మాయమాటలు చెబుతూ సొమ్ము చెల్లించరు. దీంతో కొంతకాలం ఎదురుచూసిన ఉద్యోగికి డేటా ఎంట్రీ చేయడం మానేస్తాడు. అప్పుడే నిందితులు రంగంలోకి దిగుతారు. కంపెనీ నిబంధనలు, షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగర్ నోటీసులను బాధితులకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపించి బెదిరింపులకు తెగిస్తారు. నోటీసులు రద్దు చేసుకోవాలంటే చార్జీలను చెల్లించాల్సి ఉంటుందని చెబుతారు. ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు వీరి వలలో చిక్కి రూ.6.17 లక్షలు మోసపోయాడు. ఇప్పటికే ఈ ముఠాపై సైబరాబాద్‌లో 11 కేసులున్నాయి.

వేలాది బ్యాంకు ఖాతాల విశ్లేషణ..

బాధితులు పంపించిన సొమ్ము ఏ బ్యాంకు ఖాతాలు నుంచి ఎక్కడికి బదిలీ అయ్యాయో విశ్లేషించారు. ఇతరత్రా సాంకేతిక అంశాల ఆధారంగా నిందితులు రాహుల్, సాగర్, కల్పేష్, నీలేష్‌లు సూరత్‌లో ఉన్నట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం వారిని అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారంట్ నగరానికి తీసుకొచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఆరు ఫోన్లు, ల్యాప్‌టాప్, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు సోమవారం కస్టడీకి పిటీషన్ దాఖలు చేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేశారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం..యూసూఫ్‌గూడకు చెందిన సులేమాన్ అబుబాకర్ అలియాస్ వాసిమ్, హుమాయున్‌నగర్‌కు చెందిన షేక్ అర్మన్, బంజారాహిల్స్‌కు చెందిన అర్కమ్ హుస్సేన్ రెండేళ్లుగా బెంగళూర్, గోవా నుంచి డ్రగ్ తీసుకొచ్చి పబ్‌లలో విక్రయిస్తున్నారు. నోవాటెల్ ఆర్టిస్ట్రీ, ఎయిర్ లైవ్ పబ్, క్లబ్‌రాక్‌లో కొకైన్ గ్రాము రూ.15 వేలు, గ్రాము ఎండీఎంఏ రూ.8 వేలకు విక్రయించారు. ఈ క్రమంలో క్లబ్‌లో నిజాంపేట్‌లో నివాసం ఉండే మిథున్ అనే మహిళతో సులేమాన్‌కు పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటంతో డ్రగ్‌ను ఆమెకు ఉచితంగా ఇచ్చేవాడు. ఆమెతో పాటు వారి స్నేహితులకు డ్రగ్ విక్రయించేవారు. ఈ క్రమంలో విభేదాలు రావడంతో సులేమాన్ మిథున్‌ను వేధించడం మొదలుపెట్టాడు. ఓ వైపు ఆరోగ్యం క్షీణించడం, మరోవైపు వేధింపులు తట్టుకోలేక ఆమె బాచుపల్లి షీ టీంను ఆశ్రయించింది. వారి సూచనలతో టీఎస్ న్యాబ్ సిబ్బందిని ఆశ్రయించింది. జనవరి 30న బెంగళూర్‌కు వెళ్లిన సులేమాన్, అబుబాకర్‌లు అజీం అనే వ్యక్తి వద్ద 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. ఫిబ్రవరి 2న మిథున్ రెండు గ్రాముల కొకైన్ కావాలని ఆర్డర్ చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మైహోం విహంగ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మిథున్‌కు రెండు గ్రాముల కొకైన్ అందజేశారు. అప్పటికే మాటు వేసి ఉన్న టీఎస్ న్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.26 లక్షల విలువ చేసే 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ, స్కోడా, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సులేమాన్, అర్మన్, అర్కమ్, మిథున్‌లను అరెస్ట్ చేశారు. మిథున్‌తో పాటు డ్రగ్ కొనుగోలు చేసేందుకు వచ్చిన కేపీహెచ్‌బీకి చెందిన కొనగళ్ల ప్రియ, బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ చల్లా చైతన్యలకు '41' నోటీసులు జారీ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపీ

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న ఎక్సెటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఎక్సీఎస్‌పీఎల్) కంపెనీ డైరెక్టర్ బీఎస్ సతీష్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకటచలపతి అనే వ్యక్తితో కలిసి 2015లో బెంగళూరులో ఎక్సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, గురు ప్రసాద్, పాసం వెంకట్ ప్రసాద్, జ్యోతిలతో కలిసి కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీలో బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది సామన్యుల నుంచి రూ.2 కోట్లు డిపాజిట్లు వసూలు చేశారు. ఆ తర్వాత పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'



విక్టరీ బెల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్: అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. కేన్సర్ రోగులు అధైర్యపడొద్దన్నారు. ఆత్మవిశ్వాసమే కొండంత బలమని సూచించారు. అపోలో హాస్పటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా విక్టరీ బెల్‌ను ఆవిష్కరించడం ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు. ఇది ఆస్పత్రిలోని ఆంకాలజీ యూనిట్లలో జరిగిన పోరాటాలకే కాకుండా ప్రతి కేన్సర్ రోగి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. విజయం, పట్టుదల స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అపోలో కేన్సర్ హాస్పటల్ డైరెక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ... విక్టరీ బెల్ నుంచి వచ్చే శబ్దం కేన్సర్‌ను జయించిన వ్యక్తి విజయాన్ని సూచిస్తుందన్నారు.

8,9 తేదీల్లో ఢిల్లీలో బీసీ సమరభేరి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బీసీలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీసీలపై కేంద్ర తీరును నిరసిస్తూ ఈ నెల 8, 9 తేదీలలో ఢిల్లీలో జరిగే బీసీల సమర భేరి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రవీంద్రభారతిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కె.గణేష్ చారి ఆధ్వర్యంలో బీసీల సమర భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి బీసీ ప్రధాని ఉన్నప్పటికీ బడ్జెట్‌లో తమకు మొండిచేయే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ తదితరులున్నారు.

అమెరికా నుంచి వచ్చి.. యువతిని వేధించి..

కటకటాల పాలైన ఓ కంపెనీ సీఈఓ

వెంగళరావునగర్: తన సంస్థలో విధులు నిర్వహిస్తున్న యువతి కోసం అమెరికా నుంచి వచ్చిన ఓ సీఈఓ..ఆమెను వేధించి కటకటాల పాలైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలో ఉన్న ఇన్ఫోగ్రావిటీ సంస్థ సీఈఓ టి.చంద్ర అమెరికాలో ఉంటాడు. ఇండియాలో తన కంపెనీ అభివృద్ధిలో భాగంగా నిరంతరం జూమ్ సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీలో (అమీర్‌పేట సంస్థ)లో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిని జూమ్ సమావేశంలో చూశాడు. అంతేగాకుండా ఆమెపై మనసు పారేసుకున్నాడు. తన కంపెనీ అభివృద్ధి కోసం అందమైన అమ్మాయిలకు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించడమే కాకుండా ఆమెను నిత్యం పొగిడేవాడు. అయితే అతను తన యజమాని కావడంతో యువతి ఏమీ అనలేక పోయింది. గతేడాది డిసెంబర్‌లో ఇండియాకు వచ్చిన చంద్ర ఆ యువతిని వేధించడం మొదలుపెట్టాడు. తనతో సన్నిహితంగా ఉండాలని ఒత్తిడి చేశాడు. దీంతో విసుగుచెంది అదే నెల 12న ఉద్యోగానికి రాజీనామా చేసింది. తనకు రిలీవింగ్ లెటర్, జీతం, లీగల్ సర్వీసెస్ డ్యూస్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ కావాలని కోరింది. అయితే తన కోర్కె తీరిస్తేనే వాటిని ఇస్తానని చంద్ర చెప్పడంతో ఆమె ఆగ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారి ఆంటీ హోటల్ రీ ఓపెన్

గచ్చిబౌలి: ఎట్టకేలకు కుమారి ఆంటీ హోటల్ తెరుచుకుంది. ఐటీ కారిడార్‌లో కోహినూర్ హోటల్ ఎదురుగా ట్రాఫిక్ జాం నెలకొనడంతో కుమారి ఆంటీ హోటల్‌ను ఇటీవల రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కుమారి ఆంటీ హోటల్ తొలగింపు వైరల్ కావడంతో సీఎం కార్యాలయం స్పందించింది. ఈ హోటల్‌ను అదే స్థలంలో నడుపుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించడంతో వివాదానికి తెరపడింది.



భోజనం వడ్డిస్తున్న కుమారి ఆంటీ

సీఎం రేవంత్‌రెడ్డితో వంశీచంద్‌రెడ్డి భేటీ



సీఎంకు పూలబొకె అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం రాష్ట్ర సచివాలయంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి భేటి అయ్యారు. మక్తల్ నియోజకవర్గంలో మూడు రోజుల పాలమూరు న్యాయ యాత్ర ముగించుకొని ఒక రోజు విరామం సందర్భంగా ఇరువురు నేతలు సమావేశమయ్యారు. పాలమూరు న్యాయయాత్ర కొనసాగుతున్న తీరుపై వంశీచంద్‌రెడ్డిని సీఎం అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడపాలని సీఎంకు వంశీ విజ్ఞప్తి చేశారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటన, బహిరంగసభ ఏర్పాట్లపై చర్చించారు.

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఊర్కొండ: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఊర్కొండపేటలోని అర్చకుల ఇంటి నుంచి స్వామివారి ఉత్సవ మూర్తికి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సమీప గ్రామాల నుంచి రైతులు ఎడ్లబండ్లతో తరలివచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. వందలాది భక్తులు తరలివచ్చి, స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈసందర్భంగా జై హనుమాన్ నామస్మరణ మార్మోగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చింతల మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, చుక్కాపురం అంజయ్యగౌడ్, సువర్ణ, అశోక్, పి.గోపాల్, వెంకటయ్య, లక్ష్మమ్మ, అలివేలు, సంగప్పగౌడ్, చంద్రయ్య, మల్లేష్, దత్తాత్రేయ శర్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, ఎస్ఐ లెనిన్, శ్రీనుశర్మ, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు



ఎడ్లబండ్లతో ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

కేఆర్ఎంబీకి అప్పగిస్తే మన ప్రాజెక్టులు ఎడారే



జూరాల డ్యాంపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: కృష్ణానది బేసిన్ పరిధిలోని జలాల నిర్వహణ బాధ్యతలు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తే నడిగడ్డలోని ప్రాజెక్టులకు చుక్కనీరు రాకుండా ఎండిపోతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన జూరాల ప్రాజెక్టును సందర్శించి డ్యాంపై ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి కేవలం రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధిచేకూరేలా కృష్ణా జలాల నిర్వహణ బాధ్యతలు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తూ.. రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాయటాన్ని తప్పుబట్టారు. దీనిపై బీఆర్ఎస్ నిలదీయడంతో, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. నడిగడ్డ ప్రాంత రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటే ఖచ్చితంగా వ్యతిరేకిస్తామన్నారు. రైతులతో కలిసి ఎంతవరకైన వెళ్లటానికి వెనకాడమన్నారు. ఇప్పటికైనా కుటిల రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి రైతుల పక్షాన నిలబడాలని, అదేవిధంగా కృష్ణా జలాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రఘురెడ్డి, ప్రభాకర్‌గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలమూరు స్థానం బీసీలకే కేటాయించాలి

బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్



నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సంఘటితంగా ముందుకుసాగి మహబూబ్‌నగర్ ఎంపీ సీటు బీసీలకు కేటాయించేలా పోరాటం చేద్దామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి అన్ని పార్టీలు ఎంపీ సీట్లను బీసీలకే ఇవ్వాలని లేనిచో.. ఎన్నికల్లో తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. అఖిల భారత రజక రిజర్వేషన్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు స్థానాన్ని బీసీలకు కేటాయించేలా అన్ని రాజకీయ పార్టీలపై వత్తిడి తెస్తామన్నారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. 60 శాతం ఉన్న బీసీలను దృష్టిలో ఉంచుకొని టిక్కెట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో బీసీ సమాజ్ కో-కన్వీనర్లు సత్యం, ఆర్.సత్యం, శేఖర్, శివన్న, భాగన్న, భీమన్న, రాజు, బాల్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దేవస్థానం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి ఎస్‌వీ.శ్రావన్‌కుమార్ దర్శించుకున్నారు. శనివారం మన్యంకొండకు చేరుకున్న జడ్జికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలహరి మధుసూదన్‌కుమార్, ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వయంగా ఆయనకు ప్రత్యేక దర్శనం చేయించి ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. మన్యంకొండకు చిన్న తిరుపతిగా పేరు ఉందని ఆలయాన్ని సందర్శించడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అలహరి రామకృష్ణ, ఆలయ ఈఓ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మన్యంకొండ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి ఎస్‌వీ.శ్రావణ్‌కుమార్

విహారం.. విషాదాంతం

సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడి మృతి

చందంపేట: స్నేహితుల విహారయాత్ర చివరకు విషాదాంతంగా ముగిసింది. నాగార్జున సాగర్ వెనుక జలాల్లో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం, ఉప్పునూతల మండలం గువ్వలోనిపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి పృథ్వీ (20) కొంతకాలంగా హైదరాబాద్‌లోని చంపాపేట ప్రాంతం సింగరేణి కాలనీలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం పృథ్వీ తన నలుగురు స్నేహితులతో కలిసి నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీకి విహారయత్రకు వచ్చాడు. మద్యం సేవించిన తర్వాత సాగర్ వెనుక జలాల్లో ఈత కొట్టేందుకు వెళ్లారు. పృథ్వీకి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని ఒడ్డుకు చేర్చి దేవరకొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.



ఒకటే చెట్టు.. పూతలే వేరు

చెట్టు ఒక్కటే కాని పూతలు మాత్రం వేర్వేరు. సగం పూత పసుపు వర్ణంలో ఉంటే, మరో సగం ఆకుపచ్చ వర్ణంలో కనిస్తుంది. దీంతో ఒకే చెట్టుకు పూసిన పూత వేర్వేరు రంగుల్లో కనిపించటంతో ఈ మామిడి రూటే సపరేటంటూ అందరూ అనుకుంటున్నారు. నవాబుపేట-మహబూబ్‌నగర్ దారిలో రోడ్డు పక్కన ఉన్న మామిడి చెట్టు పూత ఇలా రెండు రంగుల్లో కనిపించింది.

– నవాబుపేట

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల నుంచి నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.